# జనరంజక పాలనతో ప్రతి గడపలో సంతోషం

● ఎమ్మెల్యే మల్లాది విష్ణు
● 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ శిరీష తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనతో ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ 206 వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, నగరపాలకసంస్థ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. పసుపుతోటలో విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్ లెట్లతో వివరించారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారని విష్ణు అన్నారు. డివిజన్‌లో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**గుండెపోటు మరణాలకు అడ్డుకట్ట**

రాష్ట్రంలో సంభవిస్తున్న మరణాల్లో 32.40 శాతం గుండె సంబంధిత వ్యాధుల కారణంగానే జరుగుతున్నట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 38 లక్షల మందికి పైగా గుండె జబ్బుల బాధితులున్నారని.. వీరి ఆరోగ్య పరిరక్షణకు సీఎం జగన్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న స్టెమి ప్రోగ్రాంతో గుండెపోటు మరణాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా రోగికి గోల్డెన్ అవర్ 40 నిమిషాల్లోనే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. తద్వారా గుండెపోటు బాధితులు ప్రాణాపాయం నుంచి బయటపడటానికి వీలుంటుందని.. ఇప్పటికే తిరుపతి రుయా ఆస్పత్రిలో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేస్తున్నట్లు వివరించారు. రెండో దశ పైలట్ ప్రాజెక్టును వచ్చే నెల 29 నుంచి కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం కేంద్రంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం, నాయకులు పెనుమత్స పట్టాభిరామ రాజు, మానం వెంకటేశ్వరరావు అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వేలన్నీ మాకే అనుకూలం

పసుపుతోటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్వేలన్ని వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉన్నాయన్నారు. టైమ్స్ నౌ నిర్వహించిన సర్వే కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో 49.8 ఉన్న ఓట్ల శాతం.. 51.3 శాతానికి పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలు నెంబర్ వన్ ఛాయిస్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, పచ్చమీడియా కలిత కథనాలతో ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలోనూ విజయ ఢంకా మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత చంద్రబాబు, టీడీపీ నేతలకు ఏమాత్రం లేదన్నారు. రుణమాఫీ సహా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను చంద్రబాబు నిలువునా వంచించారని విష్ణు ఆరోపించారు. వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పథకం, రాయితీ విత్తనాలు, పురుగుమందులు, యాంత్రీకీకరణ పరికరాలు వంటి సంక్షేమ పథకాలతో నాలుగేళ్లలో అక్షరాల రూ.లక్షా 46 వేల కోట్ల లబ్ధిని అన్నదాతలకు అందించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని స్పష్టం చేశారు.

# ఆర్‌యూబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మధురానగర్‌లో పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): మధురానగర్‌లో వీఎంసీ తలపెట్టిన ఆర్‌యూవీ(రోడ్డు అండర్ బ్రిడ్జి) పనులు త్వరతగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం సెంట్రల్ నియోజకవర్గంలోని మధురానగర్ 29వ డివిజన్ సాయిబాబా కాలనీలో జరుగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు అడిగి తీసుకున్నారు. విజయవాడ నగర పాలక సంస్థ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి కొనసాగుతున్న పనుల్లో భాగంగా మధురానగర్ ఆర్‌యూబీ నిర్మాణ ప్రాజెక్టును వీఎంసీ చేపట్టిందన్నారు. స్థానికుల రాకపోకలకు, ట్రాఫిక్ సమస్యలను అరికట్టేందుకు, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ బ్రిడ్జి పనులు వేగంగా చేయాలన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన బందరురోడ్డు, బీఆర్టీఎస్ రోడ్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, స్థానికంగా జరుగుతున్న శానిటేషన్‌ను పరిశీలించారు. నగరంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జేవీఆర్‌హెచ్‌హెచ్ ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభం



రామమందిరం వద్ద అన్నదానం చేస్తున్న పూనూరు గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జయహో విజయవాడ రెసిడెంట్స్ హెల్పింగ్ హ్యాండ్స్(జేవీఆర్‌హెచ్‌హెచ్) వారి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ డాక్టర్ పి.గౌతంరెడ్డి తెలిపారు. ఏలూరు రోడ్డులోని రామమందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. జయహో విజయవాడ రెసిడెంట్స్ హెల్పింగ్ హ్యాండ్స్ గత పుష్కర కాలంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సంస్థ పేదవారికి అండగా నిలుస్తోందని చెప్పారు. ఎండాకాలం, వర్షాకాలం, శీతాకాలాల్లో పేదలకు అవసరమైన చలివేంద్రాలు, దుప్పట్ల పంపిణీ, గొడుగులు పంపిణీ చేస్తున్నారన్నారు. సమాజ సేవలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్న ట్రస్ట్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జే వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, శ్యాంప్రసాద్, హరినాథ్, దుర్గాప్రసాద్, శర్మ తదితరులు పాల్గొన్నారు

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ అలంకార్ సబ్‌స్టేషన్ 11 కేవీ గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో వుయ్యూరు జమిందార్ స్ట్రీట్, ఆంధ్ర రత్న రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, అలంకార్ థియేటర్ రోడ్డు, రామారావు స్ట్రీట్, నర్రా వారి స్ట్రీట్, గాళ్ల వారి స్ట్రీట్, జ్ఞానోలివ్ స్ట్రీట్, ఎన్జీఓ హోం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సర్వే



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిపురం, న్యూ గిరిపురం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పక్రియ త్వరలో సాకారం కానుంది. దశాబ్దాలుగా నివశిస్తున్న ఇళ్ల స్థలాలను వారి పేరునే రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా విజయవాడ సెంట్రల్ తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం ఆ ప్రాంతంలో పర్యటించి ఇళ్ల పట్టాలను పరిశీలించారు. ఇళ్ల పట్టాలు, ఆయా స్థలాల్లో నివశిస్తున్న వారి పేర్లు, ఎంత స్థలంలో ఉంటున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలోనే రిజిస్ట్రేషన్ పక్రియ జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, వీఆర్వో, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### వీఎంసీ నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భవనం నిర్మాణ స్థితిగతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడో ఫ్లోర్‌లో జరుగుతున్న మార్బల్, సీలింగ్, విద్యుత్ సదుపాయం, ప్లాస్టరింగ్ పనులను పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### సీపీని కలిసిన పదోన్నతి పొందిన ఇన్‌స్పెక్టర్లు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు రేంజి పరిధిలో 20 మంది ఎస్ఐ నుంచి ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. వీరిలో ఎన్టీఆర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐలు ఎస్.రమేష్, పి.సత్య శ్రీనివాస్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వారు కమిషనర్ టి.కె.రాణాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### సామాజిక దురాచారాలను పారదోలాలి



పటమట(విజయవాడతూర్పు): సామాజిక అసమానతలను, సాంఘిక దురాచారాలను పాటించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రముఖ వైద్యుడు జి.సమరం అన్నారు. నాస్తిక కేంద్రంలో సాంఘిక దురాచారాల నిర్మూలన అంశంపై గురువారం సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన అవినీతి, అనాగరికత, దోపిడీ వ్యవస్థలను రూపుమాపాలని, స్త్రీలపై జుగుప్సాకరంగా జరుగుతున్న ప్రవర్తనలు అంతం కావాలన్నారు. ఉన్నత విద్యావంతుల కుటుంబాల్లోనూ స్త్రీలపై చులకన భావం పెరుగుతుందని, ఇది సమాజ శ్రేయస్సు కాదని చెప్పారు. ఈ నెల 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఆర్థిక సమాత మండలి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్‌సత్యనారాయణ, బి.మణి, గోరా సైన్స్ డైరెక్టర్ జి.నియంత, దిలీప్ పాల్గొన్నారు

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న సీపీ టి.కె.రాణా

భవానీపురం(విజయవాడపశ్చిమ):రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గుణదలలోని హోటల్ హయత్ ప్లేస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న దృష్ట్యా అక్కడి భద్రతా ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా పరిశీలించారు. హోటల్ వద్ద, పరిసర ప్రాంతాల్లో చేస్తున్న కట్టుదిట్టమైన భద్రత, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లపై ఆయన గురువారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హోటల్ హయత్ ప్లేస్ పార్కింగ్ ప్రదేశాలు తదితర వివరాలను తెలుసుకుని కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులకు, ప్రజలకు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చేయటంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. అలాగే భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ టి.కె.రాణా మాట్లాడుతూ గుణదలలోని హోటల్ హయత్ ప్లేస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ రవీంద్రబాబు, సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు, మాచవరం ఇన్‌స్పెక్టర్ గుణరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యూవల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న లెక్చరర్స్ 2023–2024 విద్యా సంవత్సరానికి రెన్యూవల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, కళాశాల విద్యాశాఖ, రాజమహేంద్రవరం వారి ఆదేశాల మేరకు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల నందు 2022–2023 విద్యా సంవత్సరంలో మార్చి 31 తేదీ నాటికి కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే కాంట్రాక్ట్ పునరుద్ధరణకు అర్హులన్నారు. అర్హత కలిగిన అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ఐడీ కళాశాల(ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల) ప్రిన్సిపాల్‌కు సమర్పించాలన్నారు. 23వ తేదీన కాంట్రాక్ట్ పునరుద్ధరణకు జిల్లా ఎంపిక కమిటీ ముందు అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు 24వ తేదీన ఆయా కళాశాలల్లో బాండ్లు సమర్పించాలని ఆమె కోరారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. పటమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం, హెరాయిన్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసిక రుగ్మతలు, క్యాన్సర్ వంటి రోగాల బారిన పడతారన్నారు. మత్తు పదార్థాలతో ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతారని చెప్పారు. వీటిని తీసుకోవటం వల్ల నేర ప్రవృత్తి పెరుగుతుందని, వీటికి అలవాటు పడిన వారిని డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. వీటిబారిన పడిన వారికి నవజీవన్ బాల భవన్ నూజివీడులో బాస్కో డీ–ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని, పెజ్జోనిపేటలో నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని చెప్పారు. వివరాలకు 94904 92020 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలోపాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం షేక్ సుల్తానా, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్.జాకబ్ రాజు, షేక్ నజ్మ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 20న జూనియర్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): గన్నవరంలోని బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన జూనియర్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అనిల్ కుమార్, ఆర్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 2008 నుంచి డిసెంబర్ 2009 మధ్య జన్మించిన బాలబాలికలను ఎంపిక చేస్తామన్నారు. అర్హత గల ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీని తీసుకురావాలని సూచించారు.

## ● భళా బెజవాడ



నగరపాలకసంస్థ అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులతో నగరం రూపురేఖలు మారుతున్నాయి. కాలువల్లో చెత్త వేయకుండా నివారించేందుకు కాలువలకు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా విజయవాడ కృష్ణలంక హైవే నుంచి పశువుల ఆస్పత్రికి వెళ్లే బందరు కాలువ వంతెనపై ఫెన్సింగ్‌కు అమర్చిన పూల మొక్కలు, విద్యుత్ స్తంభాలు, లైట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో నగర వాసులు భళా బెజవాడ అని కితాబిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

# ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న చైర్మన్, ఈవో, వైదిక కమిటీ సభ్యులు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకోవడంతో పాటు మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని చెప్పారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అతి పురాతనమైన రాధాకృష్ణుల విగ్రహాలను పరిశీలించారు. రాధాకృష్ణుల విగ్రహాలతో పాటు చుట్టూ ఉన్న గోపికల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, మురళీ, కోట ప్రసాద్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ● ఊపందుకున్న సాగు పనులు



జిల్లా వ్యాప్తంగా చెదురుమొదురుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. చోడవరం వద్ద కంద చేనుకు మందు పిచికారీ చేస్తున్న రైతును చిత్రంలో చూడవచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## 600 మందికి వైద్య పరీక్షలు



పటమట(విజయవాడతూర్పు): యజమానులు నిరంతరం కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి బాగోగులపై ఆరా తీయాలని ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ చెప్పారు. క్రెడాయ్ మహిళా విభాగం, ఆంధ్రా హాస్పిటల్స్, మాక్స్ విజన్ ఆధ్వర్యంలో క్రెడాయ్ బిల్డర్ల వద్ద పనిచేస్తున్న పలువురు భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే యజమానుల సంవృద్ధన్నారు. అనంతరం శిబిరంలో 600 మంది కార్మికులకు అనుభవజ్ఞులైన వైద్యులతో కంటి, పంటి, పరీక్షలతో పాటు హృద్రోగ, జనరల్ మెడిసిన్, కాలేయం, గ్యాస్ట్రో పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణమూర్తి, ఉమెన్స్ వింగ్ కన్వీనర్ వి.జయలక్ష్మి, క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు వై.వి.రమణరావు, విజయవాడ అధ్యక్షుడు డి.రాంబాబు, కార్యదర్శి వి.శ్రీధర్, సీఎస్ఆర్ కమిటీ కన్వీనర్ సీహెచ్ సతీష్, ట్రెజరర్ టి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

**నైపుణ్యతతో అన్ని విధాలుగా అభివృద్ధి**

ఆటోనగర్(విజయవాడ తూర్పు): నైపుణ్యతను వెలికి తీయడం ద్వారా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని విజయవాడ జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ వై.విద్యాకన్నా తెలిపారు. జవహర్ ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో అసిస్టెంట్ టెక్స్‌టైల్ ప్రింటర్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శిక్షణలో మహిళలు పాల్గొన్నారు.



## ● తుది దశకు అంబేడ్కర్ పార్క్ పనులు



పార్కులో ఏర్పాటు చేసిన ఏనుగు బొమ్మ



వాటర్ ఫౌంటెన్



మొక్కలతో రూపొందించిన వివిధ ఆకృతులు

నగరంలో కృష్ణలంక జాతీయ రహదారి, బందరు కాలువ వెంబడి ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్క్ సుందరీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. నగరపాలకసంస్థ రూ.1.5 కోట్లతో పనులు చేపట్టింది. అంబేడ్కర్, రాఘవయ్య పార్కులకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రోప్ బ్రిడ్జి, పార్కులో ఏర్పాటు చేసిన గ్రీనరీ, పాథ్ వేస్, మల్టీ ప్లే సిస్టమ్, సైకిల్ ట్రాక్, ఫౌంటెన్లు, ఏనుగు బొమ్మతో పాటు మొక్కలతో రూపొందించిన వివిధ ఆకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– కృష్ణలంక(విజయవాడతూర్పు)



అంబేడ్కర్, రాఘవయ్య పార్కులకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రోప్ బ్రిడ్జి